

ధన్విక పడిన సంపును పరిశీలిస్తున్న ఎస్సై



హాజరైన అధికారులు

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, ఎన్నికల నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియ, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా తదితర అంశాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలని సూచించారు. మండల స్థాయి ఎన్నికల అధికారులు టీంగా ఏర్పడి సమన్వయంగా పనిచేయాలన్నారు. బరిలో నిలిచే అభ్యర్థులు సభలు, ర్యాలీలు, సమావేశాల కోసం తప్పక అనుమతి తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఫ్లయింగ్, సర్వైలెన్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీంలలో పోలీస్ సిబ్బంది తప్పక ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. డీసీపీ సునీతారెడ్డి మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన బందోబస్తు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ఆర్డీవోలు కె.అనంతరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, చంద్రకళ, సరిత పాల్గొన్నారు.

నగర శివార్లలోని ఫామ్‌హౌస్‌లు డ్రగ్స్ పార్టీలకు కేంద్రంగా మారాయి. మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వీకెండ్ పార్టీలు జరుగుతున్నాయి. ఇందులో 90శాతానికి పైగా అనుమతి లేని పార్టీలే. వీఐపీ కల్చర్ పెరగడంతో పార్టీల్లో మద్యంతో పాటు డ్రగ్స్ కూడా పెద్ద మొత్తంలో సరఫరా చేస్తున్నారు. ఇటీవల పలుచోట్ల ఎస్ఓటీ పోలీసులు చేసిన దాడుల్లో భారీగా మత్తుపదార్థాలు దొరికిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం రాత్రి మొయినాబాద్‌లోని చెర్రీ ఓక్స్ ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీని పోలీసులు భగ్నం చేశారు.



డ్రగ్స్.. కేరాఫ్ ఫామ్‌హౌస్‌లు

శివార్లలో విచ్చలవిడిగా వీకెండ్ పార్టీలు

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా వ్యవసాయ క్షేత్రాలు
- తాజాగా మొయినాబాద్‌లో మైనర్ల మత్తు పార్టీ కలకలం
- ఇన్‌స్టా ద్వారా ఫామ్‌హౌస్‌లో మైనర్ల ట్రాప్ హౌస్ పార్టీ
- హాజరైన 55 మందిలో 25 మంది మైనర్లే
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- అడ్డూ అదుపు లేకుండా విదేశీయుల వ్యవహారాలు
- అంతంత మాత్రం నిఘా వల్లే విచ్చలవిడితనం
- ఎస్ఓటీ దాడులు తప్పా పోలీసుల తనిఖీలేవీ?



ఆదివారం పార్టీ చేసుకున్న పెద్దమంగళారంలోని ఫామ్‌హౌస్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)/చేవెళ్ల/మొయినాబాద్, అక్టోబరు 6: మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం ఫాంహౌస్‌లో ఆదివారం మైనర్ల డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. ఇన్‌స్టాలో పరిచయమైన వీరంతా మైనర్లే. ఈ వేడుకలో డ్రగ్స్ ఉన్నట్లు సమాచారంతో అందడంతో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు తనిఖీ చేయటంతో విషయం వెలుగులోకి వచ్చింది. నగరానికి చెందిన ఒక డీజే ఇన్‌స్టా యాప్‌లో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని చెర్రీ ఫామ్‌హౌస్‌లో ట్రాప్ పార్టీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేశారు. ఇది మామూలు పార్టీ కాదని, ఇక్కడకు వస్తే అంతులేని ఆనందాన్ని ఆస్వాదించవచ్చంటూ పబ్లిసిటీ చేశాడు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే పార్టీలో పాల్గొనేందుకు పాస్‌లు తీసుకోవాలని నిబంధనలు విధించారు. ఒక్కరికైతే రూ.1,600, జంటగా వస్తే రూ.2,800 చొప్పున ధర నిర్ణయించారు. ఇన్‌స్టాలో ఇది చూసిన మైనర్లు పార్టీకి సిద్ధమయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది శనివారం మొయినాబాద్‌లోని ఓక్స్ ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. మత్తులో జోగుతున్న సమయంలో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పార్టీలో పాల్గొన్న వారికి నిర్వహించిన డ్రగ్ పరీక్షలో ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్లు పోలీస్‌లు నిర్ధారణ చేశారు. ఆరుగురు నిర్వాహకులు సూపర్‌వైజర్ ఠాకూర్ మనీష్, డీజే ప్లేయర్లు రమేష్, రోహిత్, ఫామ్‌హౌస్ ఓనర్ శేషగిరి, ఆర్గనైజర్ ఇషాన్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఫామ్‌హౌస్‌లో 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పార్టీలో పాల్గొన్న విద్యార్థులందరూ ఇంటర్మీడియట్ చదువుతున్న వారే ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు

మిగతా 5వ పేజీలో...

సంపులో పడి చిన్నారి మృతి

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఘటన

చౌదరిగూడ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ఓపెన్ సంపులో పడి ఓ చిన్నారి మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. నవాబ్‌పేట్ మండలం కొల్లూర్‌కు చెందిన శ్రీనుతో ఎనిమిదేళ్ల క్రితం శిరీషకు వివాహమైంది. వీరు కూలి చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో రెండు నెలల క్రితం శిరీష కూతుళ్లతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. సోమవారం పెద్ద కూతురు అనారోగ్యానికి గురికాగా ఆమెను చౌదరిగూడ ఆస్పత్రికి వెళ్లేందుకు ఇద్దరు చిన్న కూతుళ్లను తన పెద్దమ్మ యాదమ్మ వద్ద ఉంచింది. ఆస్పత్రికి వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత పిల్లలను చూసేసరికి చిన్న కూతురు ధన్విక(18నెలలు) కన్పించలేదు. చిన్నారి కోసం వెతికినా కన్పించలేదు. అనుమానంతో సమీపంలో ఉన్న మిషన్ భగీరథ సంపులో చూడగా అందులో దన్విక శవమై కనిపించింది. దీంతో శిరీష బోరున విలపించింది. అధికారుల నిర్లక్ష్యంతోనే పాప సంపులో పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. యాదమ్మను విచారించగా తాను మేకలకు మేత కోసం వెళ్లానని చెప్పిందని ఎస్సై తెలిపారు. శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారి సంపులో ప్రమాదవశాత్తు పడిందా? లేక లేదంటే ఎవరైనా పడేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సర్కార్ బడి.. సమస్యల ఒడి!

శిథిలావస్థకు సంగెం ప్రభుత్వ పాఠశాల

- మరుగుదొడ్లు లేక విద్యార్థినులు, టీచర్ల అవస్థలు
- 'మన ఊరు మన బడి'లో రూ. 88లక్షలు మంజూరు
- నిర్మాణ దశలో ఆగిపోయిన భవన నిర్మాణ పనులు

వర్షం వస్తే తరగతి గదుల్లోకి నీరు



అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు గదులు

కేశంపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో సర్కార్ వెనుకబడిందన్న విమర్శలు వస్తున్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

కేశంపేట మండల పరిధిలోని సంగెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 8వ తరగతి వరకు బోధన జరుగుతుంది. ఈ బడిలో 117 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో నాలుగు గదులలో, గదికి రెండు క్లాసుల

మిగతా 6వ పేజీలో...



వర్షం పడితే ఇబ్బంది



వర్షం పడితే క్లాస్ రూంలోకి నీళ్లు వస్తున్నాయి. కాంపౌండ్‌కు ఇటీవల సిమెంట్ పలుకలు వేయించారు. పాఠశాల కొత్త బిల్డింగ్ కంప్లీట్ చేయించాలి. స్కూల్‌లో రెండు క్లాసులు కంబైన్డ్ చేసి పాఠాలు చెబుతున్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు అర్థం కావడం లేదు.

- అక్షయ, 8వ తరగతి

సోను కరాటే అకాడమీ విద్యార్థుల గిన్నిస్ రికార్డు

ఆమనగల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో ఆమనగల్లు పట్టణానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలో సోమవారం నిర్వహించిన పోటీలలో అకాడమీకి చెందిన కమటం శ్రీయాంష్, యశ్వంత్, నిత్విక్‌గౌడ్, మహ్మద్ యాస్మిన్, మహ్మద్ పాల్గొన్నారు. వీరు అత్యంత ప్రతిభ కనబరచడంతో గిన్నిస్ రికార్డు సాధించారు. ప్రపంచ రికార్డు సాధించిన కరాటే విద్యార్థులు, అకాడమీ డైరెక్టర్ సోనును పలువురు అభినందించారు.



గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థులతో కరాటే అకాడమీ డైరెక్టర్ సోను

జై స్వరాజ్ పార్టీ, ప్రజా స్వరాజ్ పార్టీలకు నోటీసులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జై స్వరాజ్ పార్టీ, ప్రజా స్వరాజ్ పార్టీలు రాజకీయ పార్టీలుగా నమోదు చేయబడినప్పటికీ గత మూడు ఆర్థిక సంవత్సరాల వార్షిక అప్‌డేటెడ్ ఖాతాలను నిర్ణీత గడువులోగా సమర్పించని కారణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి నోటీసులు జారీ చేశారు. ఈ పార్టీల అభ్యర్థులు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఖర్చుల నివేదికలను సమర్పించలేదని అందులో పేర్కొన్నారు. దీని ప్రకారం ప్రజా ప్రతినిధుల చట్టం 1951లో పేర్కొన్న సెక్షన్ 29ఏ ప్రకారం రాజకీయ పార్టీగా తన విధులను నిర్వహించడాన్ని నిలిపివేసినట్లు స్పష్టంగా తెలుస్తుందన్నారు. అంతేగాక రిజిస్టర్ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తున్నామన్నారు. చర్య తీసుకునే ముందు ప్రతిపాదిత చర్యపై ఆయా పార్టీలకు అవకాశం కల్పించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించిందన్నారు. దీనిపై ఆయా పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నుంచి అఫిడవిట్, ప్రతిపాదించిన అన్ని సహాయ పత్రాలతో గత నెల 29న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉందన్నారు. ఈ విషయమై ఈ నెల 8న కమిషన్ విచారణ చేపట్టాలని నిర్ణయించిందన్నారు. ఆయా పార్టీల అధిపతులు ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. ఈ తేదీ నాటికి పార్టీల నుంచి సమాధానం రాకపోతే కమిషన్ తగు ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

షాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తల్లితో గొడవపడుతున్న తండ్రిని కుమారుడు అడ్డుకున్నాడు. తల్లితో ఘర్షణకు దిగిన తండ్రిని పక్కకు తోసేయడంతో ఇనుప యంత్రంపై పడి మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దామరపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దామరపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి సదానందం(65) మద్యం తాగి భార్య సుజాతతో గొడవకు దిగాడు. గమనించిన వారి కుమారుడు రమేష్ ఇరువురిని సముదాయించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో తండ్రి సదానందంను పక్కకు తోసేయడంతో పక్కనే ఉన్న ఇనుప యంత్రంపై పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సదానందంను కుటుంబీకులు చికిత్స నిమిత్తం షాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నా.. ఎన్ని కలవుతాయా?

» ఏ ఇద్దరు కలిసినా 'స్థానిక' ఎన్నికలపై ఇదే చర్చ

» న్యాయస్థానం తీర్పుపై ఉత్కంఠ



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. అయితే స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి న్యాయస్థానాల్లో కేసులు నడుస్తుండడంతో ఎన్నికలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏ ఇద్దరు కలిసి ఏ అంశం గురించి మాట్లాడుకున్నా.. చివరకు వారి మధ్య సంభాషణ ఎన్నికల వైపే మళ్లుతోంది. అన్నా.. అసలు ఎన్నికలు జరుగుతాయంటావా?.. అని ఒకరినొకరు మాట్లాడుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఇలా స్థానిక సంస్థల ఎన్నికలపైనే అందరూ చర్చించుకుంటున్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కొందరు హైకోర్టు, సుప్రీం కోర్టులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కావడంతో న్యాయస్థానాల్లో వీటికి సంబంధించి తీర్పులు ఎలా వస్తాయనేది ఉత్కంఠగా మారింది. దీంతో ఆశావహులంతా టెన్షన్‌తో ఉన్నారు. ఈ అంశంపై నమోదైన కేసును హైకోర్టు 8వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఇదే సమయంలో సోమవారం బీసీ రిజర్వేషన్లపై విచారణకు వచ్చిన కేసును సుప్రీం కోర్టు కొట్టివేసింది. హైకోర్టులో దీనిపై విచారణ జరుపుతున్నందున అక్కడికే వెళ్లాలని సూచించింది. దీంతో రేపు హైకోర్టు తీర్పుపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది.



ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు వేయించి ప్రజల సమస్యలను తీర్చుతానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. షాబాద్ మండల పరిధిలోని పెదవేడు గిరిజన తండాకు రోడ్డు నిర్మాణం చేయించినందుకు సోమవారం తండావాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నిటినీ సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చుతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలు గౌడ్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఖాజామియా పటేల్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, ప్రేమ్‌గౌడ్. మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, వెంకట్‌రెడ్డి. సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, రమేష్, కిషోర్ నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ ఉన్నారు.

మైసిగండి ఆలయంలో దేవేందర్‌రెడ్డి పూజలు

కడ్తాల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని సోమవారం ఫ్యూచర్ సిటీ చీఫ్ టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులు, పలువురు అధికారులతో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ శ్రీపాతి కొండల్ రెడ్డి, తహసీల్దార్ ఆర్‌పి. జ్యోతి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉన్నారు.




మైసమ్మ ఆలయంలో దేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు

సుప్రీం కోర్టు తీర్పు శుభపరిణామం : ఎంపీ


ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కల్పనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు స్వాగతిస్తున్నామని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఇది శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు రవి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8న హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూల తీర్పు వస్తుందని రవి ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ ప్రయోజనాన్ని కాంక్షించి ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి అసెంబ్లీలో తీర్మానించి జీవోను విడుదల చేసిందని పేర్కొన్నారు. బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇస్తే కొందరు తట్టుకోలేక పోతున్నారన్నారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కుట్రలను బీసీలు అర్థం చేసుకోవాలన్నారు. బీసీ బిడ్డల నోటికాడి ముద్దను లాక్కోవద్దని రవి హితువు పలికారు.





లే అవుట్ల కోసం ప్రత్యేక
వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేయండి

● మంత్రి పొంగులేటికి బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వినతి


మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రామ్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను రూపొందించాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి చాంబర్‌లో కలిసి వినతిపత్రమందజేశారు. లే అవుట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం లేక అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన మంత్రి దృష్టికి తెచ్చారు. రియల్ ఎస్టేట్ విస్తరిస్తున్న నేపథ్యంలో 1973 నుంచి గ్రామ పంచాయతీ, మున్సిపల్, జీహెచ్ఎంసీ పరిధుల్లో కొందరు అనుమతులు తీసుకుని లేఅవుట్లు వేయగా.. మరికొందరు సేల్ డీడ్‌ల ఆధారంతో నామమాత్ర అనుమతులతో లే అవుట్లు చేశారని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేసుకోకుండా, నాలా లేకుండా ప్లాట్ల అమ్మకాలు జరిపారని మంత్రికి చెప్పారు. దీంతో భూ యజమానులు, ప్లాట్ల ఓనర్లు సమస్యలనెదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే ప్లాట్ల కొనుగోలుదారులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2019లో కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం పాసు పుస్తకాలు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి లే అవుట్ల కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను తెస్తే అనేక సమస్యలు తీరుతాయని, ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మేలు కలుగుతుందని రామ్‌రెడ్డి వివరించారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్టు కార్మికుడి మృతి

● మృతదేహంతో కర్మాగారం వద్ద ఆందోళన


ఖాజామియా(ఫైల్)

తాండూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉండగా అస్వస్థతకు గురైన సీసీఐ కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కరణ్‌కోట్ సీసీఐ కర్మాగారంలో ఖాజామియా(45) కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 3న రాత్రి విధులకు వెళ్లాడు. తను విభాగంలో బస్తాలు మోస్తుండగా అస్వస్థకు గురయ్యాడు. తోటి కార్మికులు అతడిని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించగా లేబర్ కాంట్రాక్టర్ కార్మికుడి ఇన్సూరెన్స్ చందా చెల్లించలేదని అక్కడ చేర్చుకోలేదు. దీంతో ఖాజామియాను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమవారం ఏఐటీయూసీ అధ్యక్షుడు దస్తప్ప ఆధ్వర్యంలో కార్మికులు మృతదేహంతో ఆందోళన చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. వారికి కరణ్‌కోట్ మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ శరణు బసప్ప మద్దతు తెలిపారు. ఖాజామియా నిరంతరం సీటీలో పనిచేయడం వల్లే అస్వస్థకు గురై చనిపోయాడని అన్నారు. కర్మాగారం ప్రతినిధులు చర్చలు జరపడంతో బాధితులు ఆందోళన విరమించారు.

గ్రూప్-1 విజేతలకు అభినందనల వెల్లువ


ఆలూరి శ్రేయారెడ్డిని సత్కరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి


ఉజ్వలను సన్మానించి అభినందిస్తున్న ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి


అనుమిత్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే ఫలితాలు సాధన సాధ్యమేనని రుజువు చేశారు షాద్‌నగర్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు. జిల్లా స్థాయి ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. షాద్‌నగర్‌కు చెందిన న్యాయవాది అందరి అంజయ్య, జీహెచ్ఎం భాగ్యమ్మల కుమార్తె అనుమిత్ర అదనపు కలెక్టర్‌గా ఎంపికైంది. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో విధుల్లో చేరారు. ఆమెను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర సోమవారం అభినందించారు. షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులోని పెస్టిసైడ్స్ వ్యాపారి ఆలూరి భూపాల్‌రెడ్డి భాగ్యలక్ష్మీల కుమార్తె శ్రేయారెడ్డి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఆమె రాజేంద్రనగర్‌లో విధుల్లో చేరారు. శ్రేయారెడ్డిని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సన్మానించి, అభినందించారు. అలాగే పట్టణంలోని తిరుమల కాలనీకి చెందిన ఆర్ఎంపీ బి.పద్మనాభం-లక్ష్మీదేవి దంపతుల కుమార్తె ఉజ్వల కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఉద్యోగం సాధించారు. ఉజ్వలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. తమ బిడ్డలు ఉన్నత ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పోలీసు ఉన్నతాధికారులను కలిసిన జయకృష్ణ

మహేశ్వరం: రాష్ట్ర గ్రూప్1 పరీక్షల్లో ఉత్తమ ర్యాంకుతో ఉద్యోగం సాధించిన మహేశ్వరం మండల తుమ్మలూరుకు చెందిన గడ్డమీది జయకృష్ణ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి, ఐపీఎస్ మహేష్ భగవత్‌లను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. పేద కుటుంబంలో పుట్టి పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించిన జయకృష్ణ కృషి అభినందనీయం అని అధికారులు అన్నారు. ఎప్పటికైనా సివిల్స్‌లో రాణించాలనే సంకల్పంతో ఉన్న జయకృష్ణను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జయకృష్ణ మాట్లాడుతూ.. యూపీఎస్సీ లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు తెలిపానన్నారు. వారు సూచనలు చేశారని, తనకు కావాల్సిన సహాయసహకారాలు అందిస్తామన్న ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.


కమిషనర్ మహేష్ భగవత్‌తో జయకృష్ణ

కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే

దోమ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని గూడూరు గ్రామంలో గల వీరభద్ర సమేత భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నార్మాక్స్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మల్లికార్జునస్వామి కల్యాణంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పాంబండలో వైభవంగా రుద్రహోమం


రుద్రహోమం నిర్వహిస్తున్న భక్తులు

కులకచర్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా రుద్రహోమాన్ని నిర్వహించారు. ఎనిమిది నెలలుగా ప్రతీ పౌర్ణమి రోజు పాంబండ ఆలయంలో రుద్రహోమం చేస్తున్నారు. అనంతరం స్వామి వారికి పల్లకీసేవ నిర్వహిస్తున్నారు. ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. అర్చకులు దశరథం, పాండుశర్మ, అనంతమశర్మ, అమరేందర్ భక్తులతో హోమం నిర్వహించారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

పాంబండ గిరి ప్రదక్షిణను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. 34వ నెల సందర్భంగా భక్తులు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య ధ్వజారోహణం చేసి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. కార్యక్రమంలో తాండూర్ ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, నాయకులు వెంకటయ్యగౌడ్, సౌమ్యవెంకట్‌రాంరెడ్డి, టీచర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.




ఇందర్‌చెడ్‌లో ఇసుక దొంగల విషయమై ఆరా తీస్తున్న ఆర్ఐ సుధ

ఇసుక దోపిడీపై రెవెన్యూ, పోలీసు
యంత్రాంగం సీరియస్

● ఇందర్‌చెడ్‌లో డంప్‌లను పరిశీలించిన అధికారులు

బషీరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇసుక దోపిడీపై బషీరాబాద్ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సీరియస్‌గా స్పందిస్తోంది. తహసీల్దార్ షాహిదాబేగం ఆదేశానుసారం ఆర్ఐ సుధ, పోలీసులు సోమవారం ఇందర్‌చెడ్‌కు వెళ్లి ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించారు. కొంత కాలంగా అర్ధరాత్రి గ్రామంలో కొందరు సమీప వాగులోంచి ఇసుకను తరలిస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. గ్రామమంతా కలియదిరిగి ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఇసుక డంపులను గుర్తించారు. ఇసుక ఎక్కడి నుంచి తెచ్చరని లబ్ధిదారులను అడిగారు. కొందరు ఇసుకను తీసుకొస్తే కొనుగోలు చేశామని ఆర్ఐకి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుక ఉంచితంగా ఇస్తుందని, ఎందుకు కొన్నారని అధికారులు ప్రశ్నించారు. ఈ విషయం తమకు తెలియదని, కొందరు అమ్ముతుండటంతో ఇసుకను కొన్నామని వాపోయారు. వాగు నుంచి అక్రమంగా ఇసుకను ఎవరెవరూ తీసుకొస్తున్నారనే దానిపై ఆర్ఐ, పోలీసులు ఆరా తీసి వివరాలు సేకరించారు.

అలుగు ఉధృతికి కొట్టుకుపోయిన వంతెన

● ధారూరు-నాగసమందర్‌ల మధ్య నిలిచిన రాకపోకలు


రుద్రారం-నాగసమందర్‌ల మధ్య కొట్టుకుపోయిన వంతెన

ధారూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య ఉన్న వంతెనపై నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు ఉప్పొంగి ప్రవహించింది. వరద ఉధృతికి వంతెనపై వేసిన రాళ్లు, పోసిన మట్టి కొట్టుకుపోయాయి. వరద తగ్గడంతో సోమవారం వంతెన తేలింది. లో లెవల్ బ్రిడ్జి కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ వంతెనకు కొద్ది రోజుల క్రితమే ఆర్‌అండ్‌బీ అధికారులు రాళ్లు వేసి మట్టిపోసి మరమ్మతులు చేశారు. మరోసారి కురిసిన భారీ వర్షాలకు కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు వంతెనపై నుంచి ప్రవహించింది. దీంతో బ్రిడ్జిపై రాళ్లు, మట్టి కొట్టుకుపోయాయి. ధారూరు-నాగసమందర్ రోడ్డులో రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరదలకు వంతెన కొట్టుకుపోకుండా మరమ్మతులు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

సొసైటీ కార్యదర్శిని
విధుల్లోకి తీసుకోని పాలకవర్గం

● హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్న యాలాల ప్యాక్స్

తాండూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): యాలాల వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శిగా పనిచేసిన బీరప్పను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలున్నా ఆయనకు బాధ్యతలు అప్పగించకుండా పాలకవర్గం, అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బీరప్పకు ఆరోగ్య సమస్యలు, ఇతర ఆరోపణలతో 2022లో డీసీవో కార్యాలయానికి అటాచ్ చేశారు. దీనిపై అప్పట్లో ఆయన కోర్టు స్టే తెచ్చుకున్నా పాలకవర్గం అంగీకరించలేదు. దీంతో మూడు నెలలు మెడికల్ లీవ్ పెట్టారు. కంప్యూటర్ ఆపరేటర్‌కు ఇన్‌చార్జి కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. తనను విధుల్లోకి తీసుకోవాలని 2025లో బీరప్ప హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయనను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. గత నెల 27న కోర్టు ఆర్డర్‌ను ఆయన డీసీవోకు పంపగా బీరప్పకు కార్యదర్శి బాధ్యతలు అప్పగించాలని డీసీఓ సొసైటీకి లేఖ లేశారు. అయినా నేటికీ తనకు బాధ్యతలు అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీరప్ప వాపోతున్నారు.

దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల్ మల్కయ్య

యాలాల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల్ మల్కయ్య డిమాండ్ చేశారు. సోమవారం యాలాలలో కేవీపీఎస్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప మాట్లాడుతూ.. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌లో దుర్గామాత మండపం వద్ద గ్రామానికి చెందిన మ్యాటర్ వెంకటప్ప నిలబడి ఉండగా గ్రామానికి చెందిన కుర్వ మహిపాల్ దాడి చేశాడు. మూడు రోజులు అవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. కులం పేరుతో దూషించి దాడిచేసిన మహిపాల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వెంకటప్ప, మ్యాతరి నర్సమ్మ, నాయకులు చెన్నారం రవికుమార్, లాలూప్రసాద్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగకు ఏర్పాట్లు చేస్తాం

కీసర, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న కీసరలో జరిగే బొడ్రాయి పండుగకు ఏర్పాట్లు చేస్తామని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకట్‌రెడ్డి చెప్పారు. పండుగకు చేయాల్సిన ఏర్పాట్లపై సోమవారం కీసర వార్డు కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాభిశిల(బొడ్రాయి) వద్ద చలువ పందిళ్లు, గ్రామదేవతల వద్ద విద్యుత్ దీపాలు, మంచినీటి సరఫరా, కులవృత్తుల వారికి కట్నాలు తదితర ఏర్పాట్లపై కమిషనర్ చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వెంకటేష్‌యాదవ్, చర్లపల్లి కృష్ణారెడ్డి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి

హెచ్‌ఎండీఏ కార్యాలయానికి తరలిన ..

ట్రిపుల్‌ఆర్ నిర్వాసితులు

వెళ్లకుండా పలువురి అరెస్టు

ఆమనగల్లు/షాద్‌నగర్ రూరల్/కొందుర్గు/తలకొండపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, తమ భూములను రోడ్డుకు తీసుకోవద్దని కోరుతూ పలు గ్రామాల రైతులు హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయం ముందు సోమవారం ధర్నాకు నిర్వహించారు. ఆందోళనలో పాల్గొనేందుకు ఆమనగల్లు మండలం చెన్నంపల్లి వాసులు తరలివెళ్లారు. సీపీఎం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్య ఆధ్వర్యంలో వాహనాల్లో హెచ్‌ఎండీఏ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు దొడ్డి పరమేశ్, బొడ్డుపల్లి లక్ష్మయ్య, రామస్వామి, వెంకటస్వామి, లక్ష్మయ్య, వెంకటయ్య, చెన్నయ్య, తిరుమలమ్మ, రాములమ్మ, ముత్యాలు, ఎల్లమ్మ, శాంతమ్మ తదితరులు ఉన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ పలు గ్రామాల రైతులు హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి, భీమారం, ఉప్పరిగడ్డ గ్రామాల రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీను, రైతులు చంద్రకాంత్, రమేష్, హరీష్, యాదయ్య, భీమయ్య,



ఆమనగల్లు : హెచ్‌ఎండీఏ కార్యాలయానికి తరలుతున్న భూ నిర్వాసితులు



షాద్‌నగర్ రూరల్: హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

మల్లయ్య, సత్తయ్య, యాదమ్మ, విజయ, అనంతమ్మ ఉన్నారు. అలాగే పలువురు రైతులు, నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వారిలో భీమారం మాజీ ఉపసర్పంచ్ వీరేశం, నాయకులు చందు, వెంకటయ్య ఉన్నారు. హెచ్‌ఎండీఏ కార్యాలయానికి బయల్దేరిన కొందుర్గు మండలం తంగెళ్లపల్లి, పాత ఆగిర్యాల, కొత్త ఆగిర్యాల గ్రామాల రైతులను, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి, జంగయ్యలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమ భూముల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వెయ్యొద్దని నిరసన తెలిపేందుకు వెళ్లే స్వేచ్ఛ కూడా లేకుండా తమను అరెస్టు చెయ్యడమేంటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తలకొండపల్లిలో సీపీఎం నాయకులు పిప్పళ్ల శివశంకర్, బండారు లక్ష్మయ్య, గుమ్మడి కురుమయ్య, నర్సింహనాయక్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని హెచ్‌ఎండీఏం కార్యాలయం వద్ద ధర్నాకు తరలకుండా వారిని అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అణచివేత ధోరణిని గుమ్మడి కురుమయ్య ఖండించారు. రైతులకు నష్టం చేసే విధానాలను మానుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఎన్నికల్లో అధికారుల పాత్ర కీలకం

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని, అంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్, రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులు, బాధ్యతలు, నియమ నిబంధనలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమాలపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతీ బాధ్యత, రిటర్నింగ్ అధికారిదేనని, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, వారికి పోలింగ్‌కు సంబంధించిన సామగ్రి సమకూర్చడం మొదలగు ప్రతి అంశాలన పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల ప్రక్రియ కీలకమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీఆర్‌ఓ మంగీలాల్, ఆర్‌డీవో వాసుచంద్ర, ఆర్ అండ్ బీఈఈ శ్రీధర్ రెడ్డి, ఎన్నికల నిర్వహణకై వివిధ అంశాలకు కేటాయించిన ఆర్వోలు, ఏఆర్‌వోలు, ఎంపీడీవోలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శామీర్‌పేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తండాకు చెందిన ఓ వ్యక్తి కార్డు దారుల వద్ద సేకరించి ఎక్కువ ధరకు అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన సోమవారం జగ్గంగూడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతపల్లి మండలం లింగాపూర్‌తండాకు చెందిన రెడ్యానాయక్ కుమారుడు రవినాయక్(48) కొంత కాలంగా గ్రామాల్లో ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని ఎక్కువ ధరకు విక్రయించే దందా చేస్తున్నాడు. దీనిపై పోలీసులకు సమచారం అందింది. సోమవారం జగ్గంగూడలో రవి రేషన్ బియ్యాన్ని సేకరిస్తుండగా ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సై సోమిరెడ్డి పట్టుకున్నారు. రవి నాయక్ నిల్వ ఉంచిన 10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రవిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దాయాదుల ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు

కులకచర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజాహిద్‌పూర్‌లో స్థలం విషయంలో దాయాదుల మధ్య ఘర్షణలో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన అన్నదమ్ములైన దోమ వెంకటయ్య, దోమ తిరుపతయ్యలు ఖాళీ స్థలం విషయంలో సోమవారం గొడవపడి దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలకు రక్తగాయాలయ్యాయి. ఇరువురు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపారు.



సంతకాల సేకరణ చేస్తున్న ఏనుగు జంగారెడ్డి, బి.జంగారెడ్డి, కృష్ణ

ఓటు హక్కు కోసం పోరాడాలి

కందుకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును అపహాస్యం చేస్తున్న బీజేపీ కుట్రలపై ఐక్యంగా పోరాడాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్ అధ్యక్షతన కందుకూరులో సంతకాల సేకరణలో మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఓటర్ల జాబితాల్లో దొంగ ఓట్లను చేర్చి, అర్హుల పేర్లను తొలగించి రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఓట్ చోరీపై తమ నేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటం వల్లే కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో ఓటరు లిస్టుల్లో మార్పులు చేర్పులు చేసిందన్నారు. దేశంలో పక్కాగా ఓటర్ల నమోదు చేసేంత వరకూ కాంగ్రెస్ ప్రజల సంతకాల సేకరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజాప్రతాప్‌రెడ్డి, డి.శ్రీధర్, సాయిలు, జగన్, మహేందర్, బి.పాండు రంగారెడ్డి, జగదీష్, జి.కుమార్, అజీజ్, నర్సింహ, సత్యనారాయణరెడ్డి, యాదయ్య, ఖాజా మొహినుద్దీన్ పాల్గొన్నారు.

ఓటు చోరీపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

మహేశ్వరం: ప్రజల ఓటు హక్కును లాక్కుంటున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై పోరాడాలని ఉందని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం, తుక్కుగూడల్లో సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాకి ఈశ్వర్, యాదయ్య, రాజునాయక్, అల్లె కుమార్, శివ, లాజర్, నర్సింహ, జంగయ్య పాల్గొన్నారు.



తుక్కుగూడలో సంతకాలు సేకరిస్తున్న పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

డ్రగ్స్.. కేరాఫ్

ఫామ్‌హౌస్‌లు



ఫామ్‌హౌస్ పార్టీలో పట్టుబడిన మద్యం బాటిళ్లు

(3వ పేజీ తరువాయి)

చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా పోలీసులు స్పష్టం చేశారు.

మైనర్ విద్యార్థులే లక్ష్యంగా..

గత కొంతకాలంగా నిర్వాహకులు నగరంలోని సంపన్న యువతను టార్గెట్ చేసి ఈ డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి పట్టుబడిన వారిలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులే ఎక్కువగా ఉండడం గమనార్హం. పట్టుబడిన మైనర్‌కు సంబంధించిన తల్లిదండ్రులు, సంరక్షకులను పిలిచి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టుబడిన నిర్వాహకులు ప్రతీ వారం ఇలాంటి పార్టీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వీరేగాక నగరంలో అనేక ముఠాలు యువతను ఆకర్షించేందుకు వీకెండ్ పార్టీలు నిర్వహిస్తున్నారు. ఫామ్‌హౌస్‌లు అనుకూలంగా ఉండడంతో అద్దెకు తీసుకుని వీటిని నడుపుతున్నారు. సంపన్నవర్గాలకు చెందిన పిల్లను టార్గెట్‌చేసి వారికి మత్తుపదార్థాలు అలవాటు చేస్తున్నారు. ఇలాంటి వారి గుట్టురట్టుచేసేందుకు పోలీసులు మరిన్ని దాడులు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

షాద్‌నగర్‌లో హెరాయిన్ కలకలం

ఇదిలా ఉంటే ఇటీవల షాద్‌నగర్ పట్టణ శివారులోని సంజు దాబాలో మాదకద్రవ్యాల విక్రయాలు కలకలం రేకెత్తించాయి. పోలీసుల దాడుల్లో రూ. 2 కోట్లకుపైగా విలువైన హెరాయిన్ పట్టుబడింది. ప్రతీ నెలా ఇక్కడ నుంచి రూ. కోట్ల విలువైన మత్తుపదార్థాల అమ్మకాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో హెరాయిన్ సరఫరానే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. నిందితులంతా 2019 నుంచి



ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన మత్తుపదార్థాలను షాద్‌నగర్ కేంద్రంగా నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది.

జూన్ 11న త్రిపుర రిసార్ట్స్‌లో..

శివార్లలో బర్త్‌డే పార్టీల్లో డ్రగ్స్ సేవించడం సర్వసాధారణమైంది. ఈ ఏడాది జూన్ 11న ప్రముఖ సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో పాల్గొన్న ఒకరి శరీరంలో గంజాయి ఆనవాళ్లు ఉన్నట్లు పరీక్షల్లో తేలడం కలకలం రేపింది. దీంతో సింగర్ మంగ్లీపై పోలీసులు కేసు నమోదు చేశారు. చేవెళ్ల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని త్రిపుర రిసార్ట్స్‌లో నిర్వహించిన ఈ పార్టీలో పలువురు ప్రముఖులు కూడా ఉండడం గమనార్హం. ఆమె కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, సినిమా పరిశ్రమకు చెందిన పలువురు సన్నిహితులు కలిపి మొత్తం 22 మంది ఈ బర్త్‌డే పార్టీకి హాజరయ్యారు. నిర్వాహకులు పార్టీకి అనుమతి తీసుకోకపోవడంతో డ్రగ్స్ ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ జరిపి అక్కడ ఉన్న 22 మందిలో 9మంది అనుమానితులకు పోలీసులు గంజాయి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఒకరికి మాత్రమే పాజిటివ్ వచ్చింది. అతన్ని విచారించగా తాను గంజాయి మూడు రోజుల కిందట తీసుకున్నానని, ఈ పార్టీలో కాదని పోలీసులకు తెలిపాడు. తాను గంజాయి తీసుకున్న వివరాలతో పాటు తనకు సప్లై చేసిన వారి సమాచారం విచారణలో బయటపెట్టాడు. ఈ ఘటనకు సంబంధించి సింగర్ మంగ్లీతోపాటు ఆమె మేనేజర్ దున్న మేఘరాజ్, అతడి స్నేహితుడు దామోదర్ రెడ్డి(గంజాయి సేవించిన వ్యక్తి), త్రిపుర రిసార్ట్స్ అసిస్టెంట్ మేనేజర్ శివరామకృష్ణలపై కేసు నమోదు చేసి 41ఏ నోటీసులు జారీ చేశారు.

విచ్చలవిడిగా విదేశీయుల వ్యవహారం

విదేశీలు సైతం ఇక్కడ ఫామ్‌హౌస్‌లను అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డగా వాడుకుంటున్నారు. గత ఆగస్టు 15వ తేదీన మొయిన్‌బాద్‌లోని బాకారంలో ఎస్‌కెఎం ఫామ్ హౌస్‌లో 51 మంది విదేశీయులు మందు పార్టీ చేసుకుంటుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఆఫ్రికాలోని 11 దేశాలకు చెందిన వీరంతా గంజాయి, విదేశీ మద్యం సేవిస్తూ పట్టుబడ్డారు. నార్కోటిక్ బ్యూరో అధికారులతో కలిసి దాడులు నిర్వహించగా ఇందులో 37 మంది మహిళలు ఉన్నారు. అనంతరం ఇమిగ్రేషన్ అధికారులు వచ్చి వారి వీసాలు తనిఖీ చేశారు. హుక్కా 20 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇటీవల మొయినాబాద్ మండలం తోల్‌కట్టలో వ్యవసాయ క్షేత్రంలో కోళ్ల పందెం ఆడుతూ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి 64 మందిని పట్టుకున్నారు. భారీగా మద్యం, నగదు, క్యాసినో కాయిన్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే శివార్లలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతూనే ఉన్నాయి. ఎస్‌ఓటీ పోలీసుల తరుచూ దాడుల్లో డ్రగ్స్ బయటపడుతున్నా వీటిని పూర్తిస్థాయిలో అరికట్టడం సాధ్యపడడం లేదు. స్థానిక పోలీసులు ఫామ్‌హౌస్‌లపై సరైన నిఘా పెట్టడం లేదనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. దీంతో శివార్లలోని ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ కల్చర్ పెరుగుతున్నట్లు చెబుతున్నారు.

గతేడాది జన్వాడ ఫామ్‌హౌస్‌లో..

గతేడాది అక్టోబర్‌లో శంకరపల్లిలోని జన్వాడ గ్రామ పరిధిలోని కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల ఫాంహౌజ్ పై ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసిన సంగతి తెలిసిందే. ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీలో 35 మంది పాల్గొన్నారు. ఇక్కడ విదేశీ మద్యంతో పాటుగా క్యాసినో ఆట వస్తువులను సైతం స్వాధీనం చేసుకుని, పలువురికి డ్రగ్ టెస్టులు నిర్వహించారు. రాజ్ పాకాల సన్నిహితుడైన విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్టుగా పాజిటివ్ రావడంతో ఆయనపై మోకిల పోలీసులు ఎన్‌డీపీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అప్పట్లో ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. అలాగే ఆగస్టు 2వ తేదీన మెయినాబాద్ ఫామ్‌హౌస్‌లోని బర్త్‌డే పార్టీలో ఆరుగురు ఐటీ ఉద్యోగులు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. డ్రగ్స్‌ను హిమాచల్ ప్రదేశ్ నుంచి తీసుకువచ్చి పార్టీ నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఎల్‌ఎస్‌డీ బ్లాట్స్, హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మండ్లీ రాములు, నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. పార్టీకి పనిచేస్తూ ప్రజాభిమానం ఉన్న వారికే ఎన్నికల్లో అవకాశమొస్తుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీకి ఆశావహులు సోమవారం తమ అనుచరులతో ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ప్రజాభిమానం ఉన్న వారి పేర్లను పీసీసీకి నివేదిస్తానని కసిరెడ్డి హామీ ఇచ్చారు. అభ్యర్థులెవరైన కాంగ్రెస్ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. పనిచేసే వారికి పార్టీలో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే విజయసోపానాలని, రాష్ట్రంలో ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే విజయమని నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కడ్తాల మండలంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌కు స్థానిక ఎన్నికల్లో తొలి ప్రాధాన్యం ఇస్తామని కసిరెడ్డి స్పష్టం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలో పోటీకి నాయకులంతా ఒక్కతాటిపైకొచ్చి అభ్యర్థులను సూచించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, మండ్లీ రాములు, యాట నర్సింహ, కల్లు రమణారెడ్డి, హన్మనాయక్, అనితవిజయ్, నిట్ట నారాయణ, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆయిళ్ల సత్కారం

కడ్తాల్: మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కలిశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు బిచ్యానాయక్, అలాగే రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

బాకీ కార్డును ప్రతీ గడపకు చేర్చాలి



కాంగ్రెస్ బాకీ కార్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లవుతున్నా 6 గ్యారెంటీల్లో మూడింటినైనా అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాల్ని నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రతీ ఇంటికి చేరవేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు పోటీచేయాలనుకునేవారు నాయకులు, కార్యకర్తలతో చర్చించి పేర్లను ఖరారు చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలపై స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రాజునాయక్, కె.చంద్రయ్య, ఎం.పాండు, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.నవీన్, రాఘవేందర్‌రెడ్డి, అంబయ్య, నందం, యాదయ్య, జంగయ్య, జానారెడ్డి, రమేష్, వీరుబాబు, కె.ప్రభాకర్, ఆదిల్, బాలయ్య, మనోహర్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని

తరలించొద్దు



సురేష్‌కుమార్

కొడంగల్ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అప్పాయిపల్లి వద్ద నిర్మించే మెడికల్ కళాశాలను, పాత కొడంగల్ వద్ద నిర్మించే ఇంటిగ్రేటెడ్ కళాశాలను దూద్యాల్ మండలం లగచర్ల, హకీంపేట్ గ్రామాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీపీఐ నాయకుడు గంటి సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం కొడంగల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణానికి అప్పాయిపల్లి రైతుల నుంచి భూసేకరణ చేశారని, అందుకు అనుగుణంగా 50పడకల ఆసుపత్రిని 220పడకలకు అప్‌గ్రేడ్ చేశారన్నారు. అలాగే ఆస్పత్రి నిర్మాణ పనులు చివరి దశకు చేరాయన్నారు. పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటు చేస్తున్నామని భూమిపూజ చేసి ఏడాది అవుతున్నా పనులు నత్తనడకన సాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు హాస్టల్‌ను తరలిస్తున్నట్లు సమాచారం వస్తోందని, ఎందుకు తరలిస్తున్నారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'స్థానిక' అభ్యర్థుల కోసం కసరత్తు

గెలుపు గుర్రాల వేటలో రాజకీయ పార్టీలు.. ▸▸ రిజర్వేషన్లతో కొత్త వారికి అవకాశం



ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో నిలిపే అభ్యర్థులపై ఆయా రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల్లో ఎవరిని నిలిపితే గెలుస్తాం.. అంగబలం, అర్థబలం, పలుకుబడి ఉన్న వారి కోసం ఆరా తీస్తున్నాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నేతృత్వంలో సమన్వయ కమిటీల సమావేశాలతో ఆయా మండలాల్లో అభ్యర్థుల జాబితా తయారు చేస్తున్నారు. అలాగే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచనల మేరకు కాంగ్రెస్ నాయకులు మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆశావహుల లిస్టును సేకరిస్తున్నారు. బీజేపీ, సీపీఎంలు తమకు పట్టున్న చోట అభ్యర్థుల వేట మొదలెట్టాయి. ఈ సారి బీసీలకు 42శాతం సీట్లు కేటాయించిన సర్కార్.. ఎన్నికల్లో ఎలాగైనా ఆధిపత్యం నిలుపుకోవాలనే పట్టుదలతో ఉంది. కాగా రిజర్వేషన్లతో తమ అంచనాలు తారుమారవడంతో పోటీకి ఆసక్తి చూపిన కొందరు విరమించుకునే పరిస్థితి ఏర్పడింది. ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులను బీసీ మహిళకు రిజర్వు చేశారు. యాచారం జెడ్పీటీసీ, ఎంపీపీ బీసీ జనరల్‌కు వచ్చాయి. మంచాల జెడ్పీటీసీ ఎస్టీ జనరల్, ఎంపీపీ బీసీ జనరల్, అబ్దుల్లాపూర్‌మెట్ జెడ్పీటీసీ, ఎంపీపీ జనరల్ మహిళలకు కేటాయించారు. గతంలో ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీగా కాంగ్రెస్ అభ్యర్థి మహిపాల్ గెలుపొందగా, ఎంపీపీగా బీఆర్ఎస్ కృపేశ్ పని చేశారు. మంచాల జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. జెడ్పీటీసీగా మర్రి నిత్య, ఎంపీపీగా నర్మద సేవలందిచారు. తదనంతర పరిణామాల్లో నర్మద బీఆర్ఎస్‌లో చేరారు. యాచారం జెడ్పీటీసీగా బీఆర్ఎస్‌కు చెందిన చిన్నోళ్ల జంగమ్మ, ఎంపీపీగా బీజేపీకి చెందిన కొప్పు సుకన్య సని చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ జెడ్పీటీసీ, ఎంపీపీ రెండూ కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. జెడ్పీటీసీగా బింగి దాసుగౌడ్, ఎంపీపీగా రేఖ పని చేశారు. అయితే ప్రస్తుతం రిజర్వేషన్ల మార్పుతో గతంలో జెడ్పీటీసీ, ఎంపీపీగా పనిచేసిన ఏ ఒక్కరూ ఎన్నికల బరిలో నిలిచే అవకాశాలు లేవు, చాలాచోట్ల కొత్తవారికి అవకాశాలు దక్కనున్నాయి.

ఎన్నికలపై రియల్ దెబ్బ

ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికలు గతంలో లాగా ఆర్భాటంగా జరిగే పరిస్థితులు కన్పించడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతినడం ఎన్నికలపై ప్రభావం పడింది. అభ్యర్థులు ఖర్చుకు వెనకంజ వేసే అవకాశాలే ఎక్కువ. నోటిఫికేషనొచ్చినా గ్రామాల్లో హడావిడి లేదు. నామినేషన్ల ప్రక్రియ మొదలైతేనే ఎన్నికల వాతావరణం నెలకొనే పరిస్థితి ఉంది. ఆశావహులు ఖర్చుకు వెనకడుగు వేస్తున్నారు. 'టికెట్ వస్తుందో.. రాదో? ఇప్పటి నుంచే ఖర్చు ఎందుకు?' అని మిన్నకుంటున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి స్థానిక ప్రజాప్రతినిధులు తమ పార్టీ వారే ఉండాలనే ఉద్దేశం మేరకు ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగు వేస్తున్నాయి.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు



ఆమనగల్లు సీఐ జానకి రాంరెడ్డి

ఫటా ఫట్

ఆమనగల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజా సంబంధాలు మెరుగు పరుచుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని ఆమనగల్లు సీఐ జానకి రాంరెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి కార్యాచరణ అమలు చేస్తున్నారు?

ప్రజా సంబంధాలు మెరుగుపరుచుకోవడం ద్వారా గ్రామాల నుంచి సత్వర సమాచారం పొందుతున్నాం. తద్వారా నేరాలు, వివాదాలు జరుగకముందే, చోటుచేసుకునే అవకాశం ఉన్నప్పుడు ముందుగానే అక్కడికి చేరుకొని పరిస్థితి చక్కదిద్దుతున్నాం.

చోరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఆమనగల్లు సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. వాహనాల తనిఖీ చేపడుతున్నాం. పాత నేరస్థులు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు, వ్యాపారులకు సూచించాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలా ముందుకెళ్తున్నారు?

హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మేడిగడ్డ గేటు నుంచి సూర్యలక్ష్మి కాటన్‌మిల్ వరకు బ్లాక్ స్పాట్స్ గుర్తించాం. ఆ ప్రాంతంలో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాం. ప్రమాద సూచిక బోర్డులతో పాటు పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయించాం.

ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశాం. రూల్స్‌ను అధిగమించే వాహనాదారులకు జరిమానాలు విధిస్తున్నాం.

ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారా?

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశాం. డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

సర్కార్ బడి.. సమస్యల ఒడి!

(మూడో పేజీ తరువాయి)

చొప్పున 8 తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో శిథిలావస్థకు చేరుకున్న ఒక తరగతి గదిలోకి వర్షం వస్తే నీళ్లు చేరుతాయి. అలాగే గోడలు పదును ఎక్కుతాయి. దీంతో ఈ తరగతిలో విద్యార్థులు కూర్చోవాలంటేనే భయపడుతున్నారు. కిచెన్‌షెడ్ లేకపోవడంతో అందుబాటులో ఉన్న గదిలో వంట చేస్తుండగా పొగతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా పాఠశాలలో మరుగుదొడ్లు లేక మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసరమైతే తెలిసిన వారి ఇంటికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేక నానా అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా పాఠశాలకు ప్రహరీ లేక కుక్కలు, పశువులు సంచరిస్తుండటంతో ఇటీవల సంగెం గోపాల్‌రెడ్డి అనే దాత సిమెంట్



వర్షాలకు నానిన తరగతి గది గోడలు

పలుకలు ఏర్పాటు చేయించారు. అయితే, గేటు సరిగా లేకపోవడంతో రాత్రి సమయాలలో బడి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'మన ఊరు- మన బడి' అంతేనా?

గత ప్రభుత్వంలో సంగెం ప్రభుత్వ పాఠశాలలో 'మన ఊరు- మన బడి', ఎన్ఆర్ఈజీఎస్ పథకాల కింద ఐదు అదనపు తరగతి గదులు, ప్రహరీ, కిచెన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.88లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో 2023 మార్చి 24న మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్ అదనపు తరగతి గదులకు ఫుటింగ్‌లు పూర్తిచేసి, పిల్లర్లు వేశాడు. చేసిన పనులకు బిల్లు రాకపోవడంతో పనులను అర్ధంతరంగా ఆపేశాడు.

వాష్‌రూంలు లేక ఇబ్బంది పడుతున్నాం



మా పాఠశాలలో వాష్‌రూంలు లేక ఇబ్బంది పడుతున్నాం. ఉన్నదానికి డోరు లేదు. ఒకరు బయట ఉంటే మరొకరు లోపలికి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

- నైనిత, విద్యార్థిని, 8వ తరగతి

9 నుంచి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

శంషాబాద్ రూరల్/శంషాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు మండల స్థాయిలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శంషాబాద్ క్రీడాపోటీలు మండలంలోని ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, 17 విభాగాల్లో ఈనెల 9న ఖోఖో, వాలీబాల్, 10, 11 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్‌నెంబర్ : 7702227888ను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీలను మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, పుష్పలత, శంకర్, తిరుపతయ్య, నిర్మల, రవి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర శంషాబాద్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

మాయమాటలు చెప్పి బంగారం అపహరణకు యత్నం

● పట్టుకున్న గ్రామస్తులు.. పోలీసులకు అప్పగింత



పట్టుబడిన దొంగలు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలికి మాయమాటలు చెప్పి ఆమె వద్ద ఉన్న బంగారు వస్తువును దగ దగ మెరిసేలా చేస్తామని చెప్పి అపహరించిన సంఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెలిజర్లలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి చిన్నమ్మ ఇంటి వద్దకు వచ్చిన ఇద్దరు యువకులు వెండి, బంగారు వస్తువులు ధగ ధగ మెరిసేలా చేస్తామని నమ్మించారు. ముందుగా ఆమె నుంచి వెండి కడియాలు తీసుకుని మెరిసేలా కడిగి ఇచ్చారు. తర్వాత మెడలో ఉన్న తులంన్నర బంగారు గుండ్లహారం తీసుకున్నారు. ఇంట్లోకి వెళ్లి దానిని స్టౌవ్ వెలిగించి అందులో వేసి పసుపు వేశారు. తెల్లగా మారిందని.. టిఫిన్ బాక్సులో పెట్టామని చెప్పారు. యువకులు అక్కడి నుంచి వెళ్లిన కొంత సేపటికి టిఫిన్ బాక్సు తెరిచి చూడగా అందులో గుండ్లహారం కనిపించలేదు. వెంటనే గ్రామస్తులకు విషయం చెప్పడంతో గాలింపు చేపట్టారు. గ్రామంలోని ఓ టీ స్టాల్ వద్ద టీ తాగుతున్న ఇద్దరు యువకులను పట్టుకుని దేహశుద్ధి చేసి మందలించగా తామే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి గుండ్లహారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకుని ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్



కడ్తాల్: పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హామీలను విస్మరించి ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్‌పై విశ్వాసం కోల్పోయిన ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు స్థానిక మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క గ్యారంటీని కూడా పూర్తిస్థాయిలో అమలు పర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై ప్రజలు నిలదీయాలన్నారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మి నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, రావిచెడ్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేశ్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు బాలకృష్ణ, లింగం, జితేందర్‌రెడ్డి, బిక్షపతి, మల్లేశ్, రవి, రాజు, బీఆర్ఎస్‌లో చేరిన వారిలో రవి, రామోజీ, శివయ్య, శ్రీశైలం, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

షాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని మాజీ జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. షాబాద్ మండలంలోని కుర్వగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అవినాశ్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటయ్య, నాయకులు శ్రీనివాస్, నరేష్ తదితరులు ఉన్నారు.



షాబాద్ : అవినాశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సంక్షేమం

షాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం షాబాద్ మండలంలోని ఎట్లఎర్రవల్లి గ్రామానికి చెందిన పీసరి సతీష్‌రెడ్డి, కటికె హరీష్, మనోహర్, రవి, కుమ్మరి రమేష్, కొత్త కుర్వ మల్లేష్ కాట్నా, మహేందర్, మాణయ్యల తోపాటు మరో 30 మంది బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో సురేందర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, ఆంజనేయులు, ఇబ్రహీం, అమరేందర్‌రెడ్డి, నర్సింలు, రాజేందర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



షాబాద్ : కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న సురేందర్‌రెడ్డి

మహేశ్వరం 'స్థానిక' పోరులో పోటీకి సిద్ధం

మహేశ్వరం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఎం సిద్ధంగా ఉందని ఆ పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటీ చేసేందుకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న సీపీఎం స్థానిక ఎన్నికల్లో పోటీ చేయబోతుందని, ప్రజలు సీపీఎంను ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నామన్నారు. ముఖ్యంగా పార్టీకి పట్టున్న ప్రధాన గ్రామాలైన మాణిక్యమ్మగూడ, కోళ్లపడకల్, పోరండ్ల, అమీర్‌పేట, దుబ్బచర్ల, తుమ్మలూరు, నాగారం గ్రామాల్లో పోటీకి పార్టీ తరఫున స్థానిక ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రజా మద్దతు కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలువాల రవికుమార్, ప్రకాష్, జంగయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం : సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

డబుల్ బెడ్‌రూంలలో 'కార్డెన్ సెర్చ్'

శంకర్‌పల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూంలలో పోలీసులు సోమవారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రాత్రి 10:30 గంటల ప్రాంతంలో రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కేఎస్ రావ్ ఆధ్వర్యంలో దాదాపు 150మంది పోలీసులు కార్డెన్‌సెర్చ్‌లో పాల్గొన్నారు. 13 బ్లాకులలోని 1521 ప్లాట్‌లలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలు, బైకులు, కార్లు, ఇతర వాహనాల వివరాలను తెలుసుకున్నారు. బయటి ప్రాంతం వారు ఎవరైనా ఉంటున్నారా? అని ఆరా తీశారు. మంగళవారం తెల్లవారుజాము వరకు తనిఖీలు చేపట్టనున్నట్లు అడిషనల్ డీసీపీ కేఎస్ రావ్ వివరించారు.



శంకర్‌పల్లి : డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కేఎస్ రావ్

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

కొత్తూర్ : స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ నర్సయ్య సూచించారు. మండల పరిధిలోని సిద్దాపూర్, మైఎంతండా, చింతగట్టుతండాలతో పాటు ఆయా గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమైనారు. ఎన్నికల నిబంధనలను ప్రతీ ఒక్కరు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద సీసీ కెమెరాలను ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కొత్తూర్ : గూడూర్ గ్రామస్తులతో ఇన్‌స్పెక్టర్ నర్సయ్య

ఎన్నికల సమయంలో శాంతి పాటించాలి

కడ్తాల్ : స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతి, క్రమశిక్షణ పాటించాలని సీఐ గంగాధర్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు సిబ్బందితో సోమవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు సమయంలో ఎవరైనా మద్యంను అధిక ధరలకు విక్రయించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించే లేదా అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాక్‌డ్రిల్‌లో ఎస్సైలు చంద్రశేఖర్, వరప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కుసుమ విత్తనాల పంపిణీ

షాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నూనెగింజల పరిశోధనా కేంద్రం-రాజేంద్రనగర్ సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తిరుమలాపూర్ రైతులకు కుసుమ విత్తనాలను అందజేశారు. నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు విత్తనాలు అందజేసినట్లు చెప్పారు. కుసుమ సాగు, సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ పద్ధతులను ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు అంజయ్య, మధుసూదన్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణయ్య, మహిపాల్, మల్లయ్య తదితరులు ఉన్నారు.



రైతులకు విత్తనాల బ్యాగులు అందజేసిన రత్నాకర్

మాజీ ఎంపీటీసీ పాపయ్య మృతి

● నివాళులర్పించిన నాయకులు

కేశంపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సరికొండ పాపయ్య(70) సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఫోన్‌లో మృతుడు పాపయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాపయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీలు తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, మాజీ ఎంపీటీసీ అనురాధ పర్వత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మంజులా మల్లేష్, చిర్ర చంద్రయ్య, పల్లె ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, గ్రామానికి చెందిన గాండ్ల అశోక్ కుమార్, యచవరం జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, రమేష్ యాదవ్‌లు ఈ సందర్భంగా సంతాపం తెలిపారు.



పాపయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కేశంపేట : మండల పరిధిలోని కొత్తపట గ్రామానికి చెందిన మల్లి రాములమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు పాలాది శ్రీనివాస్ మృతురాలు రాములమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. తట్టెపల్లి నరసింహ, పులి శ్రీకాంత్, శివ, మల్లి రామయ్య, బాల్‌రాజ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నాడు చుక్క నీరు రాలే.. నేడు ఉబికి వస్తున్న గంగమ్మ



వ్యవసాయం చేయడానికి నీటి అవసరాల కోసం గతంలో బోరు వేస్తే చుక్క నీరు రాలేదు. నిరాశతో కేసింగ్ పైపుతో వదిలేశారు. అయితే, ఈసారి వారి ఆశలు అడియాశలు కాలేదు. నిండు వర్షాలతో గంగమ్మ తల్లి బోరు నుంచి ఉబికి రావడంతో అన్నదాతల సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడకు చెందిన మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి వ్యవసాయానికి నీరు సరిపోక పోవడంతో 8 ఏళ్ల క్రితం బోరు వేశారు. ఈ సమయంలో చుక్క నీరు రాకపోవడంతో వృథాగా వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో భూగర్భజలాలు ఘనణీయంగా పెరిగాయి. దీంతో బోరు బావి నుంచి నీరు పైకి ఉబికి వస్తోంది.

- కేశంపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి)

ఆలయ అభివృద్ధికి విరాళం

● ఉన్నతోద్యోగం రావడంతో రూ.లక్ష విరాళం అందజేసిన యువతి

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదలతో పాటు కొలువల కల్పవల్లిగా విలసిల్లుతున్న నందివనపర్తి జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆశీస్సులతో ఉన్నత ఉద్యోగం సాధించిన యువతి ఆలయ అభివృద్ధికి రూ.లక్షా వెయ్యి విరాళం అందజేసి మొక్కు చెల్లించుకుంది. మంచాల మండలం ఆరుట్లకు చెందిన తాడూరి భార్గవి-వెంకట్‌రెడ్డి దంపతుల కుమార్తె తేజస్వి అమెరికాలో ఎమ్మెస్సీ చదువుతోంది. ఈక్రమంలో ఇండియాకు వచ్చినప్పుడు జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకొని అమెరికాలో ఉన్నత ఉద్యోగం సాధిస్తే మొదటి జీతంలో నుంచి కొంత ఆలయ అభివృద్ధికి చెల్లిస్తానని మొక్కుకుంది. ఉద్యోగం సాధించడంతో సోమవారం జ్ఞాన సరస్వతిని దర్శించుకొని ఆలయ అభివృద్ధికి రూ.లక్ష వెయ్యి చెక్కు అందజేసింది. ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు ఇస్తున్న తేజస్వి తల్లిదండ్రులు

చదువుకు పేదరికం అడ్డుకాదు



కడ్తాల్ : ఆర్థికసాయం అందిస్తున్న హనుమాన్ నాయక్

కడ్తాల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డుకాదని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమానాయక్ అన్నారు. ప్రతిభ ఆధారంగానే ఏ రంగంలోనైనా గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆదివాసీ విద్యార్థిని శిరీష బాయికి సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష బాయికి రూ.10వేలు హనుమానాయక్ ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు ప్రతీ ఒక్కరూ తోడ్పాటును అందించి ప్రోత్సహించాలన్నారు. ఆత్మస్థైర్యం, పట్టుదలతో ముందుకు సాగే విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యక్షుడు తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

కేశంపేట : మండల పరిధిలోని చౌలపల్లి గ్రామ పంచాయతీ మీనమోనిపల్లి గ్రామానికి చెందిన ఎ.బాల్‌రాజ్ ఇటీవల కందుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దాంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కొత్తపేట జడ్పీహెచ్-1994-95 పదో తరగతి స్నేహితులు సోమవారం అతడిని స్వగ్రామంలో కలిసి పరామర్శించి రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కె.బాలరాజ్, అవ్వారి చంద్రశేఖర్, డ్రైవర్ నరసింహ, సురేష్, రొల్లు శ్రీనివాస్, రంగు అంజయ్య, ఎల్లనమోని శేఖర్ తదితరులు ఉన్నారు.



కేశంపేట : ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులందజేస్తున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక వికాసం, శారీరక ధారుడ్యానికి దోహదపడుతాయని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలో వస్పుల శివకుమార్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. శివ టీం విన్నర్‌గా, ఎంకే చాలెంజర్స్ టీం రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్టుకు రూ.20 వేలు, షీల్డ్‌ను రాము అందజేశారు. నిర్వాహకులు వస్పుల ప్రభుశంకర్, రాజు, చెన్నకేశవులు, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న యాట నర్సింహ

కడ్తాల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. పట్టణాలకు దీటుగా గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నూతనంగా ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం రాత్రి స్థానిక నాయకులతో కలిసి నర్సింహ ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో మండలానికి 12 హైమాస్ట్ లైట్లు మంజూరైనట్లు తెలిపారు. బాల్‌రాజ్, షాబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నేడు(మంగళవారం) తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే నారాయణరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసినట్లు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండ లాధ్యక్షులు జగన్, డోకూరు ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.